క్లుప్తంగా

టీషర్టులు పంపిణీ

మానకొండూర్: మండలంలోని చెంజర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సెపక్ తక్రా పోటీలకు ట్రయల్ రన్‌లో సెలక్టయిన విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో చెంజర్ల ఉన్నత పాఠశాలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల సెలక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. పోటీల్లో సెలెక్టయిన క్రీడాకారులు ఈనెల 11, 12 తేదీల్లో ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి కరీంనగర్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ సెక్రటరీ గన్ను విజయభాస్కర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కరుణాకర్ రెడ్డి తెలిపారు. క్రీడాకారులకు జస్పీ ర్‌సింగ్, తమ్మిసెట్టి రాజేశ్ టీషర్ట్‌లు సమకూర్చారు. టోర్నమెంట్‌లో సీనియర్ క్రీడాకారులు, పీఈటీలు కుమార్, శ్రీను, అజయ్, సుమన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డీఎల్‌పీవో విచారణ

ఇల్లందకుంట: మండలంలోని సీతంపేట గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై మాజీ ఎంపీటీసీ ఓదెలు గతంలో ఫిర్యాదు చేయగా కలెక్టర్, డీపీవో ఆదేశాల మేరకు శుక్రవారం డీఎల్‌పీవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. గ్రామంలో చేపట్టిన పనుల వివరాలతో పాటు ఎంబీ రికార్డులను స్వాధీనం చేసుకున్నామని, విచారణ అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్, డీపీవోకు అందజేస్తామన్నారు.మాజీ సర్పంచ్ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ ఓదెలు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి రామన్నపల్లిలోని సర్వే నంబర్ 393లో ముస్లింల పవిత్ర గ్యారిమి షరీఫ్ స్థలంలో గద్దె, ప్రహరీ, హైమాస్ట్ లైట్లు, సీసీరోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్‌కు ముస్లింలు, మాజీ కౌన్సిలర్లు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గ్యారిమి షరీఫ్ స్థలంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం, మైనార్టీ నాయకులు ఎండీ గౌసొద్దీన్, మాజీ కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్, బోనగిరి ప్రశాంత్, ఎండీ ఇర్ఫాన్ పాషా, రేండ్ల సుమన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీలు అందజేత

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ నిర్వాహకుడు జగదీశ్వర్, ఎస్సై శేఖర్‌రెడ్డి డిక్షనరీలు అందించారు. గంగిశెట్టి మధురమ్మ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు డిక్షనరీలు, పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, మధ్యాహ్న భోజన కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్‌ను ఎస్సై అభినందించారు.

సర్వేను అడ్డుకున్న రైతులు

శంకరపట్నం: వరిపొలాల్లో సర్వే చేయొద్దని మండలంలోని లింగాపూర్ గ్రామంలో రైతులు శనివారం సర్వేను అడ్డుకున్నారు. ఓ రైతు భూమి సర్వే చేయాలని హైకోర్టు ఆర్డర్ ఉందని సర్వేయర్‌తో రావడంతో రైతులు అభ్యంతరం చెప్పారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ సురేఖ గ్రామానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. హైకోర్టు ఆదేశాలు కాదు, లాయర్ పంపిన పత్రాలు అంటూ వాదనకు దిగారు. హైకోర్టు ఆదేశాల మేరకు సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని సూచించగా రైతులు ససేమిరా అనడంతో తిరిగి వెళ్లిపోయారు. విషయమై తహసీల్దార్ వివరణ కోరగా హైకోర్టు ఆదేశాలతో సర్వే చేసేందుకు సర్వేయర్ వెళ్లారని, సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని స్పష్టం చేశారు.

తాత్కాలిక మరమ్మతు

గన్నేరువరం: మైలారం నుంచి గన్నేరువరం వరకు వెళ్లే రోడ్డుకు శుక్రవారం తాత్కాలిక మరమతు పనులు చేపట్టారు. మండల కేంద్రం నుంచి వయా మైలారం, ఖాసీంపేట, బెజ్జంకి మండలంలోని వడ్లూరు మీదుగా బేగంపేట వరకు బీటీ రోడ్డు వేయడానికి సంబంధిత కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. ప్రస్తుతం పనులు నిలిచిపోయాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలమయంగా మారడంతో ఆర్టీసీ బస్సు సర్వీసు కొద్ది రోజులుగా నిలిచింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు సంబంధిత కాంట్రాక్టర్ గుంతలరోడ్డుపై మట్టి పోసి చదును చేయించాడు. కాంగ్రెస్ నాయకులు మల్లేశం, మల్లేశం, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

షోకాజ్ నోటీసు

చిగురుమామిడి: చిగురుమామిడి ఎంపీడీవో బి. మధుసూదన్‌కు శుక్రవారం జిల్లా పరిషత్ సీఈవో షోకాజ్ నోటీసు జారీ చేశారు. రేకొండ, చిగురుమామిడి పంచాయతీ వార్డు రిజర్వేషన్ల విషయంలో జరిగిన తప్పిదాలను సవరించడంలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై నోటీసు జారీచేశారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉన్నప్పటికి చిగురుమామిడి 3వ వార్డు, రేకొండలోని 14వ వార్డు రిజర్వేషన్ వివరాలు తప్పుగా నమోదు అయ్యాయి. గెజిట్ ప్రచురణ అనంతరం తప్పిదాలను సరిచేయకుండా నిర్లక్ష్యం వహించారని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందిన మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని సీఈఓ శ్రీనివాస్ ఆదేశించారు. లేనిపక్షంలో తదుపరి చర్యలకు బాధ్యులవుతారని అన్నారు. కాగా ఎంపీడీవోపై ఆయా జీపీ కార్యదర్శులు కొందరు గతంలో ఫిర్యాదు చేయడం గమనర్హం. కాగా షోకాజ్ నోటీసు జారీపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



హుజూరాబాద్ పట్టణంలోని మోడల్ చెరువు



మోడల్ చెరువు కట్టపై రోడ్డును కమ్మేస్తున్న పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు

ముళ్లపొదలు, చెత్తాచెదారం

- మోడల్ చెరువు అభివృద్ధిపై నీలినీడలు
- పాలకులు, అధికారుల నిర్లక్ష్యం
- అధ్వానంగా చెరువు పరిసరాలు

హుజూరాబాద్: పర్యాటకం, మత్స్యకారులకు ఉపాధి, సాగునీటి కష్టాలను దూరం చేసే కల్పవల్లిగా ఉన్న మోడల్ చెరువు అభివృద్ధిపై నీలినీడలు అలుముకున్నాయి. ప్రజాప్రతినిధులు మోడల్ చెరువు అభివృద్ధిని విస్మరించడంతో చెరువు పరిసరాలు కళా విహీనంగా మారాయి. సిద్దిపేట జిల్లాలోని కోమటి చెరువును అక్కడి ఎమ్మెల్యే రాష్ట్రానికే దిక్సూచిగా మార్చారు. అలాంటి స్థాయిలోనే హుజూరాబాద్ మోడల్ చెరువు ఉండగా పాలకుల నిర్లక్ష్యం మూలంగా అభివృద్ధి అటకెక్కింది. జమ్మికుంట రోడ్డులో సిర్సపల్లి క్రాస్ వద్ద సర్వేనంబర్ 215లో 116 ఎకరాల్లో చెరువు విస్తరించి ఉంది. 2001కి ముందు చెరువు కింద ఉన్న భూమిని అక్కడి రైతులు ఆక్రమించి సాగు చేస్తే మోడల్ చెరువు సాధన సమితి నాయకులు ఉద్యమం చేశారు. చెరువు భూమి ఆక్రమణకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర స్థాయిలో ఉద్యమిస్తే హద్దులను నిర్ణయించి భూమి అన్యాక్రాంతం కాలేదు. అప్పటి ఎంపీ సుగుణకుమారి చెరువు అభివృద్ధి కోసం నిధులు కేటాయించారు. మాజీ మంత్రి, ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చెరువు అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించినా పనులు మాత్రం ముందుకుసాగలేదు. చెరువు నుంచి డీబీఎం–16 కాలువ వెళ్తోంది. చెరువు నిండాలంటే వరదనీరు వచ్చేది లేదు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు చెరువులో నీరు ఉన్నప్పటికీ చెరువు నిండుకుండలా మారాలంటే తప్పనిసరిగా డీబీఎం–16 కాలువ ద్వారా నీరు మళ్లించాల్సిన పరిస్థితి. చెరువు నిండితే మత్స్యకారులకు, చెరువు సమీపంలోని వ్యవసాయబావుల్లో నీటి నిల్వ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అలాంటి అవకాశం లేదు. చెరువు కట్టపై చెత్తాచెదారం పేరుకుపోతోంది. కట్టపై రోడ్డును ముళ్లపొదలు కమ్మేస్తున్నాయి.

అభివృద్ధి చేయాలి



పర్యాటక రంగంగా మోడల్ చెరువును అభివృద్ధి చేయాలి. కానీ ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టడం లేదు. చెరువు కట్టపై రోడ్డును ముళ్లపొదలు కమ్మేస్తున్నాయి.

– మామిడి కిరణ్, మామిండ్లవాడ

చర్యలు తీసుకోవాలి



పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తే వినోద ప్రాంతంగా మారుతుంది. చిన్నారులు, యువత సెలవుల్లో దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుంది. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తౌసీఫ్, హుజూరాబాద్

అధికారులు స్పందించాలి



చెరువు భూమి పరిరక్షణ సమస్యను గవర్నర్ వరకు తీసుకెళ్లగా అధికారులు హద్దులు నిర్ణయించారు. మోడల్ చెరువును అభివృద్ధి చేయాలి.

– అయిత హరీశ్, మోడల్ చెరువు సాధన సమితి నాయకుడు, హుజూరాబాద్

అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ



కెల్లెడలో అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్



మెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో..



వావిలాలలో పోషకాహారంపై అవగాహన

మానకొండూర్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని కెల్లెడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం సభ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... గర్భిణులు, తల్లులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఐరన్, కాల్షియం గూర్చి వివరించారు. బెల్లం, పల్లీలు, నువ్వులు, మునగ ఆకు, కరివేపాకు ప్రయోజనాలు తెలియజేశారు. ఆహార నియమాలతో పాటు ఆరోగ్య జాగ్రత్తలు కీలకమని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వరూప, ఆశ రమ, పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని ముత్తారం, మెట్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభ నిర్వహించారు. తొలిదశలోనే వ్యాధులను గుర్తిస్తే నయమవుతాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చందు అన్నారు. ఆరోగ్య మహిళా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే చక్కర వాడకం తగ్గించాలని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత సూచించారు. పురుషులకు వంటల పోటీలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, ఎల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, అరుణ పాల్గొన్నారు.

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళ ఆరోగ్యం కుటుంబ ఆరోగ్యమని, ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్‌సూపర్‌వైజర్ కుసుమకుమారి, కార్యదర్శి రాము, అంగన్‌వాడీ టీచర్లు రేష్మ, గౌతమి, జ్యోతి, స్వర్ణలత పిల్లల తల్లులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ మౌనప్రదర్శన



మౌనప్రదర్శనలో ఉద్యోగులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి ప్రధాన ద్వారం ఎదుట వైద్య విధాన పరిషత్ ఉద్యోగులు తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన చేపట్టారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వాతి మాట్లాడుతూ.. జీతాల చెల్లింపులో ప్రభుత్వ వైఖరితో తీవ్ర ఇబ్బందులుపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతినెలా ఒకటో తేదీలోపే జీత భత్యాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు ఆలస్యం రావడంతో ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేస్తే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సమస్యలను ప్రభుత్వం తక్షణమే గుర్తించి, సకాలంలో జీతాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు సులోచన, భూమా, జ్యోతి, సునీత, ఏసుమణి, స్రవంతి, సుభాషిని, రమ్యకష్ణ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



హుజూరాబాద్: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం సాయంత్రం మూడు గంటల నుంచి నాలుగున్నర గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్, కొత్తగట్టు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రఘు తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు గంటల వరకు, కొత్తగట్టు సబ్‌స్టేషన్‌లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బస్సు సర్వీసు పునరుద్ధరణ

శంకరపట్నం: కాచాపూర్, రాజాపూర్ గ్రామాలకు శుక్రవారం ఆర్టీసీ బస్సు పునరుద్ధరించారు. కాచాపూర్–గద్దపాక గ్రామాల మధ్య కల్వర్టుకు గండి పడడంతో నెలరోజులుగా బస్సు సర్వీసు నిలిచిపోయింది. గురువారం మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, రైతులు మరమ్మతు చేశారు.

క్షేత్ర పర్యటన

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లిలో పట్టు పురుగుల పెంపకం కేంద్రాన్ని శుక్రవారం పట్టణంలోని శస్త్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. మల్బరీ ఆకుల ఉత్పత్తి, పెంపకం, తదితర అంశాలను విద్యార్థులు పరిశీలించారు. స్కూల్ కరస్పాండెంట్ వేణుమాధవ్, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

చిగురుమామిడి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో నాయకులు భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం బీసీ సెల్ మండల అధ్యక్షుడు హనుమాండ్ల సత్యనారాయణ, నాయకులు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలకు ఉపయోగపడని జీవో విడుదల చేసి మనోధైర్యం దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, నాయకులు పెద్దపల్లి అరుణ్‌కుమార్, పెనుకుల తిరుపతి, మాజీ ఎంపీటీసీ మెడబోయిన తిరుపతి, మాజీ సర్పంచ్ సన్నీల్ల వెంకటేశం, చింతపూల ఆంజనేయులు, పిల్లి వేణు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

రామడుగు: యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, జీవితం నాశనం చేసుకోవద్దని రామడుగు ఎస్సై కె.రాజు తెలిపారు. మండలంలోని వెదిర అల్ఫోర్స్ స్కూల్‌లో శుక్రవారం సాయంత్రం మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇంచార్జి ఎస్సై సురేందర్, షీటీం ఇంచార్జి స్వప్న, ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేసి ఎక్కడైనా మత్తు పదార్థాల అమ్మకం జరిగితే వెంటనే 8712670767 నంబర్‌కు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ఆలయాలకు విరాళం

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ అభయాంజనేయస్వామి ఆలయం అభివృద్ధికి శ్రీఆంజనేయ భజనమండలి సభ్యులు రూ. 5016 విరాళం ఆలయ సేవకుడు వెంకన్నకు అందజేశారు.

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట శ్రీమానసాదేవి ఆలయానికి చొక్కారావుపల్లె గ్రామానికి చెందిన అర్కొంతం పద్మమునీందర్‌రెడ్డి రెండు తులాల బంగారం గొలుసు బహూకరించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ప్రధాన అర్చకుడు అమర్నాథ్‌శర్మ సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బద్దం మల్లారెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, బద్దం రమణారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి బహుమతి

రామడుగు: జిల్లా కేంద్రంలో ఎస్సీఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో రామడుగు మోడల్ స్కూల్ విద్యార్థులకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి వచ్చిందని ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ తెలిపారు. డీఈవో మొండయ్య చేతుల మీదుగా బహుమతి అందుకున్నారని, విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

జమ్మికుంట: పట్టణంలోని ఎమ్మార్సీ భవనం ఎదుట జమ్మికుంట మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన తెలిపారు. ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టుల తగ్గించడం సరికాదన్నారు. ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ సర్ ప్లేస్ పోస్టులను తగ్గించి హై స్కూల్‌లో పీఈటీ పోస్ట్ ఇస్తూ ప్రాథమిక పాఠశాలలను ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీటీ ఐక్యవేదిక కన్వీనర్ గుడిమల్ల బలరాం, సభ్యులు దబ్బెట రవీందర్, నాగరాజు, మేడుదల నాగరాజు, రాజిరెడ్డి, కుమారస్వామి, విజయ్, సురేష్, రాజు, సారంగం, అంజన్ ప్రసాద్, వేణుగోపాల్, తిరుపతి, రాహుల్, ప్రవీణ, రాణి, సంధ్యారాణి, శిరీష, సమీర, హర్షియా, రాగిణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



కంటి ఆపరేషన్ కోసం వెళ్తున్న గ్రామస్తులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రేకుర్తి కంటి వైద్యశాల సిబ్బంది ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. 82 మందికి పరీక్షలు చేసి 34 మందిని ఆపరేషన్ కోసం ఆసుపత్రికి తరలించారు. టెక్నిషియన్ ప్రభాకర్, జిల్లా వైస్ గవర్నర్–1 మోర భద్రేశం, అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మోహన్, కోశాధికారి అంజియాదవ్, జోన్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్ శ్యాంసుందర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజిరెడ్డి, మల్లారెడ్డి, అనంతరెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



శంకరపట్నం: మండలంలోని అంబాల్‌పూర్ గ్రామశివారులో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎన్‌హెచ్‌ఏ(563) బైపాస్ రోడ్డు కోతకు గురైంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సర్వీస్ రోడ్డు, ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



కేంద్రమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



ఎంపీ ఈటల రాజేందర్‌కు..

మానకొండూర్: మండలంలోని ఈదులగట్టెపల్లి స్టేజీ వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామానికి చెందిన మీస రమణయ్య, రమేశ, దాసరి యాదగిరి, సంగ మల్లేశ్ శుక్రవారం కరీంనగర్ ఎంపీ, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు కరీంనగర్‌లో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు ఎదుర్కొనే సమస్యను వివరించారు. ఇటీవల అదనపు కలెక్టర్, ఆర్డీవో పరిశీలన చేశారని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ రీరజినల్ ఆఫీసర్, పీడీకి మంత్రి కార్యాలయం నుంచి లెటర్ పంపారని గ్రామస్తులు వివరించారు.

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామంలో రైల్వే లైన్ 18 గేటు వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు గ్రామస్తులు, రైతులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. రైల్వే అధికారులు ఎవరికి నష్టం కలగకుండా సర్వే చేశారని, కానీ కొందరు కావాలని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. జమ్మికుంట, హుజూరాబాద్ మండలాల్లోని ప్రజలు, రైతులు, వాహనాదారులకు 12 నుంచి 15 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని, బ్రిడ్జి పనులు కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించారని, బ్రిడ్జి నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

ఓటు చోరీపై విస్తృత ప్రచారం చేయాలి



వీణవంక లో మాట్లాడుతున్న ప్రణవ్

వీణవంక: ప్రజాస్వామ్య వ్యవస్థకి మూల కారణమైన ఓటుహక్కును బీజేపీ ప్రభుత్వం హరిస్తోందని, ఓటుచోరీపై కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని, పోరాటానికి హుజూరాబాద్ నాయకులు ముందుంటారని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శుక్రవారం వీణవంక మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. వివిధ గ్రామాల నాయకులు ప్రణవ్‌కు స్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ.. వీణవంకలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రజలకు మరింత సేవ చేసేందుకు, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాలయం ఉపయోగించుకోవాలని సూచించారు. బీజేపీ ఏ విధంగా ఓటు చోరీ చేస్తుందో రాహుల్‌గాంధీ వివరించి చెప్పారని, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు గ్రామగ్రామాన సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీనిలో భాగంగా వీణవంకలో మొదలు పెట్టామన్నారు. డిక్లరేషన్ ఫాంపై ప్రణవ్ సంతకం చేసి డీసీసీ కార్యాలయానికి పంపారు. అదే విధంగా బూత్ స్థాయి నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఐదు రోజుల్లో పూర్తి చేయాలని కోరారు. ప్రజల్లో ఓటు చోరీపై విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపు ఇచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిక

మండల పరిధిలోని మల్లన్నపల్లి, ఘన్ముక్ల గ్రామాల్లోని బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కష్టపడే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ప్రణవ్ సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, కర్ర భగవాన్ రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, గంగాడి తిరుపతి రెడ్డి, కొమ్మిడి రాకేశ్ రెడ్డి, చిన్నాల ఐలయ్య, మాదాసు సునీల్, ఓరేం శ్రీనివాస్, శ్రీపతి రెడ్డి, పంజాల సతీష్, గెల్లు శ్రీనివాస్, పల్లెర్ల కిరణ్, మ్యాక వీరయ్య ఉన్నారు.

నూతన కార్యవర్గం

హుజూరాబాద్: దీపావళి టపాసుల యూనియన్ కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక హైస్కూల్ గ్రౌండ్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జమాల్‌పూర్ అనిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఐతే కిషోర్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర కుమార్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా చొక్కారపు యాదగిరి, కోశాధికారిగా మాడిశెట్టి బాలకృష్ణన్ నియామకమయ్యారు. అలాగే గౌరవ సభ్యులుగా భూపతి లచ్చన్న, కొమురవేల్లి కిరణ్, గౌతమ్, ముఖ్య సలహాదారులుగా మొలుగు భానుచందర్, గోస్కుల రాజ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోలి వేణు, భరత్, బండి సాయికృష్ణ, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భవనం పరిశీలన

సైదాపూర్: సైదాపూర్‌లో కోర్టు ఏర్పాటుకు హుజూరాబాద్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి పీబీ. కిరణ్‌కుమార్ వెన్కెపల్లి ఎస్టీ హాస్టల్ భవనం, పరిసరాలను పరిశీలించారు. కేసుల సత్వర పరిష్కారానికి రెండు లేదా మూడు మండలాలకు ఒక సీనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరు చేస్తుండగా మండలానికి చెందిన న్యాయవాదులు సైదాపూర్‌లో కోర్టు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ మేరకు హుజూరాబాద్ కోర్టు సూపరింటెండెంట్ గోపీనాథ్ గత బుధవారం హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. శుక్రవారం కిరణ్‌కుమార్ సందర్శించి కోర్టు ఏర్పాటుకు భవనం అనుకూలంగా ఉందని, హైకోర్టుకు నివేదిక పంపిస్తామన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, వెన్కెపల్లి మాజీ సర్పంచ్ మునుపాల రవి, పెర్కపల్లి మాజీ ఎంపీటీసీ మిట్టపల్లి కిష్టయ్య న్యాయవాదులు వడిజె భీమ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, గోపి కృష్ణ, హరిహరన్, కుమారస్వామి ఉన్నారు.